"గాలిం గుంబి నగ్ని నాకాశస్థలిన్ నల్డి కుల్కలన్" అంటూ ప్రారంభించి ఎక్కడా ఎప్పుడూ నాకు చావులేనట్టు వరం ప్రసాదించు దేవా అంటూ కోరేట్ట హిరణ్యకశిపుడు బ్రహ్మదేవుణ్ణి.

"ఇచ్చేను పట్టుకుపో!" అన్నాట్ట బ్రహ్మదేవుడు.

ఇలా ఎక్కడన్నా జరుగుతుందా? ఇన్ని శక్తులు రాక్షస మాత్రుడి కుండగలవా? ఆ యుగాలలో అటువంటి వారుండేవారేమో. కాని ఇంకా ఏ యుగంలో నన్నా అన్ని శక్తులున్న వాళ్ళు పుడతారా? ఇలా ఎన్నో అనుమానాలు నాకొచ్చేవి.

ఓ రాత్రి కలలో కలిపురుషుడు కనిపించి "ఏం బ్రదర్, ఎలా ఉన్నావ్? అని కుశల ప్రశ్నలు వేశాడు. కలిపురుషుడి రూపురేఖలా? సరిగా గుర్తు లేదు. కాని మామూలుగా మనలాగే షర్టూ, పంట్లాం తొడుక్కున్నట్టు గుర్తు. రెండే చేతులు, రెండే కాళ్ళు, ఒకే తల.

# హీరో

### మంథా వెంకట రమణారావు



కాని కలిపురుషుడే. ఆడగవల్సిందడిగేసు .... ....

"ఏం సార్. తమయుగం ఇంత నాసిరకంగా తయారయిందేమిటి? ఏ బ్రహ్మదేవుడూ ఏ వరమూ ఎవరికీ ఇవ్వటం ఇంత వరకు జరగలేదేం? అతీత శక్తులున్న మహాపురుషులు (హిరణ్యకసిపుడు మహాపురుషుడు కాదంటారేంటి కొంపదీసి?) మరి మనమధ్య పుట్టరా?"

అంటూ అడిగేసు.

"ముందు పద. అలా అయ్యర్ హోటల్లో దూరి కాఫీ సేవిద్దాం." అన్నాడు కలి.

కాఫీ ఆర్డరిచ్చాను. "నాకు పంచదార ద్దు. మధుమేహం" అన్నాడు.

"తమకి కూడా రోగమేనా?"

"ఎంమహా డౌటు. నాకు లేనిరోగం లేదు. కలియుగంలోని రోగాలన్నీ నాలో జీర్ణించుక పోయివున్నాయి. సిఫ్లిస్, గనేరియాలతోసహా" అన్నాడాయన ఏదోలా చూసి. ఆదోలా అంటే ఆ రోగాలాయన కుండడం నాకు లేక పోవడం. ఆయన ఔన్నత్యానికి చిహ్నం అన్నట్టుందా చూపు.

"మీరు సంపూర్ణం ఆరోగ్యవంతుల్లా కనిపిస్తున్నారే!"

"రోగాలుండడం నా ఆరోగ్యం. ఏ రోగం లేకపోయినా నా అనారోగ్యం ప్రారంభమౌతుంది." అతడి ఆరోగ్య రహస్యం సెలవిచ్చాడు.


"తమరు నా అసలు డౌటు తీర్చలేదు. అతీతశక్తులున్న మహాపురుషుల సంగతి పునఃప్రస్తావనచేసా

"ఎందుకా డౌట్ అటువంటి అతీత శక్తులున్న వీరులూ, ధీరులూ మీ మధ్య. లేరను కుంటున్నావా?" అన్నాను కాఫీ ఒక గుటకమింగి. పంచదార బొత్తిగాలేదు.

ఆయన నవ్వేడు. జర్దాకిళ్ళీ అల వాటులావుంది. పళ్ళు ఎరుపూ నలుపూ మిశ్రమంతో అప్పుడే మేకని చంపి తిన్న తోడేలు కోరల్లా ఉన్నాయి. అతడు నవ్వి నప్పుడు. లాలాజలపు జల్లు నా కాఫీలో పడింది.

"కళ్ళు తెరుచుక గమనించేవా?" అడిగేడు.

## ఒకే సూత్రీకరణ



ఎక్కడైనా, ఎప్పుడైనాలక్ష్యంముందు లక్షణం. నేటి కవిత్వంలో ఎన్నో వాదాలు పోటాపోటీ పడుతున్నమాట నిజమే. ఈ వైవిధ్యాన్ని నేను ఆహ్వానిస్తాను. ఆదరిస్తాను. దేశమంతటికీ ఒకే పార్టీవుంటే బాగానే వుంటుంది. అలాగే యావత్కవిత్వానికి ఒకే సూత్రీకరణ. అంత ఎత్తుకి మనమింకా ఎదగలేదు.

-మహాకవి శ్రీశ్రీ

"గమనించకేం? మీ కుండవచ్చేమో ఆ శక్తులు."

"నువ్వు నా యుగంలోని మనిషిలా లేవే!"

"నన్ను సత్తికాలం మనిషినని మా అమ్మమ్మనేదిలెండి."

"అర్థమౌతూనే వుంది. నీ వాలకం గమనిస్తే. నువ్ సినిమాలు చూస్తావా?

ఆవేం మాటలు గురూగారూ, విడుదల నాడు ఉదయం ఆటకి మొదటి టిక్కెట్ కొయించందీ నిద్ర పట్టదంట నాకు." గర్వంగా కాలరెత్తి అన్నాడు.

"అంతేకాదు. నువ్వు వారపత్రికల్లోని సీరియల్స్ చదువుతావా?"

"ఆదేం మాటసార్. సీరియల్స్ నా తిండీ నిద్రాను." అంటూ నా అభిమాన రచయితల పేర్లూ వారు రాసిన మహా రచనలూ ఏకరువు పెట్టేను.

"మరి ఆ సినిమాల్లోని వింతలూ, ఆ నవలల్లోని విడ్డూరాలు గమనించలేదా? ఓ సిగరెట్టు నా కిచ్చి ఓటతను వెలిగించి దమ్ములాగుతూ అడిగేడు.

"వింతలూ విడ్డూరాలూ. ఏమిటి మీరంటున్నారు! ఆ పాత్రలన్నీ నా వంటి సామాన్య జీవుల ప్రతిబింబాలే."

"అంటే అంత ఇష్టపడ్డారన్నమాట." డాక్టర్ రోగినిచూస్తున్నట్టుచూసి కన్నుగీటేడు.

"యూ ఐలైక్డదమ్ వెరీమచ్." ఛాలెంజిగా చూసేను అతడికేసి.


"సినిమాచూస్తూన్నంతసేపూ మరిపై ప్రపంచమే గుర్తుకురాలేదనుకోండి. సీరియల్ చదువు తున్నంతసేపూ నా మనస్సు పరవళ్ళు తొక్కి నా కళ్ళు చెమర్చి నా రోమాలు గగుర్పొడిచి .... మాటలు చాల్లేదు నాకు.

పక పకా నవ్వేడు కలిపురుషుడు, దగ్గేడు తుమ్మేడు. కాఫీ ఒలకబోసేడు టేబిలు మీద. పొలబోగా నోట్లోవున్న కాఫీనీ, చొంగని నా మీద ప్రక్షాళనం చేసి అన్నాడు కదా_"యుఆర్ధరోలీ బ్రెయిన్ వాష్. నీ మెదడుని పూర్తిగా కడిగి ఉతికి ఆరపెట్టేడు."

చెప్పొద్దూ నాకుచాలా కోపమొచ్చేసింది. టేబుల్ గుద్దేను. "నేను స్వతంత్రంగా ఆలోచించగల మేధావిని. నన్నెవరూ బ్రెయిన్ వాష్ చెయ్యలేరు. చేసేవాడు పుట్టలేదు."

"పుట్టా లేదు. పామూలేదంటావ్ నాగలోకానికీ, నాగపూర్ అనవులకీ భేతాళుడికీ స్పేస్ రిసెర్చ్ సెంటరుకీ సంబంధం లేదంటావ్?" మరో క్విజ్ ప్రయోగించేడు నామీద.

"అపార్థాలు తియ్యకండి. నేను హేతువాదిని. మరోసారి బల్లగుద్దబోగా వెయిటర్ రపీమని నా చెయ్యి పట్టుక ఆపి_" టేబిలిరగదుగాని తమరి సెయ్యి నూరుకుంటాదిసార్. అసలే టేక్కు పలసమదుసులు." అంటూ సలహా ఇచ్చి తప్పుకున్నాడు.




"నీకు బుద్ధివుందా? మా ఆవిడ స్నానం చేస్తుంటే చూస్తావా? కోపంగా అడిగాడు సుబ్బారావు పక్కింటి అప్పారావుని "క్షమించండి. ఈసారి స్నానం చేసాక చూస్తాను."

"అయితే విను. నువ్వు నిన్నచూసిన సినిమాలో హీరో ఎత్తెంత? చెస్ట్ ఎంత? వయసెంత? బలమెంత? వాడు చేసిన వీర కార్యాలు వర్ణించు."

"హీరోకేం? నా ఫేవరెట్టునటుడు. ఎత్తు అయిదడుగుల ఆరుఅంగుళాలు. వయసు నలభై వుండచ్చు. ఇంక వీర కార్యాలా? ఓ సారి వెళ్ళిచూడండి పిక్చరు తెలుస్తుంది."

"నాకు తెలుసులే, నువ్వేం తెలుసుకున్నావో విందావని. చెప్పు చెప్పు."

'ఏ వుంది? నా హీరో నిత్యయువ్వసుడు. నాచిన్ననాటి నుంచి హీరోగా ఆరాధించి దేవుడికి రోజూ మొక్కుకున్నాను. దేవుడా. ఈనా హీరోని నిత్యయువ్వసుడిగా చేసి జరామరణాలు, వార్థక్యం లేకుండా ఎన్ని కష్టాలనయినా, నష్టాలనయినా అవలీలగా అధిగమించగల ధీరుడిగాచెయ్యి. జన్మ జన్మలకీ ఇతడే నాహీరోగా చెయ్యి. దేవుడు నేకోరుకున్న ఎన్నో కోరికల్ని ఏనాడూ వినలేదు. కానీ ఈ నా కోరికను మాత్రం మన్నించాడు. ఆ నాచిన్ననాటి చిన్న హీరో ఈనాడు పెద్ద హీరోగా మారేడు. ముసలి హీరోగా ఏనాడూ అవబోడు. అవడు. అవలేదు. అవనివ్వను."

"పరే! నీలాంటి వారంతా దేశంమీద కోకోల్లలు. అసలు నీ హీరో అంటే నీకు ఎందుకిష్టమో చెప్పు. అతడి శక్తిని నిరూపించు."


"హీరో అంటే ఎవడికిష్టం వుండదయ్యా. హీరోలేని కథ ఎక్కడ ఏడిసింది? అఖరికి నీ పురాణాలకీ. రామాయణ భారతాలకి నీ బైబిలూ. ఖురాన్‌కీ హీరో వున్నాడంటావా, లేడంటావా? వారికి సర్వ శక్తులూ వున్నాయంటావా, లేరంటావా? అలానే దేశానికి హీరో లున్నారు. సర్వశక్తులూ ప్రదర్శిస్తున్నారు.

వారంతా ముసలి వాళ్ళయ్యారు. అవతారాలు చాలించేసారు. మరి మీ హీరో అవతారం ఎప్పుడు చాలిస్తాడు? నిన్నరాత్రినే చూపిన సినిమాలో నా హీరో ఎన్ని కష్టాలెదురయినా వాటిని అవలీలగా దాటేడు. విలన్ని వాడి సిబ్బందిని సున్నంలోకి ఎముకలేకుండా ఒక్కడూ కొట్టేడు, వానరబలం లేకుండా రాముడు సీతని రక్షించ గలిగే వాడా? కాని నా హీరో సింగిల్‌హేండెడుగా శత్రుస్థావరంలోకి జొరబడి విలన్‌చేత రేప్ చేయబడి పోతున్న హీరోయిన్ని ఆఖరి క్షణంలో రక్షించ గలిగేడు!"

"నీ హీరోకి ఎక్కడా దెబ్బలు తగల్లేదా?"

"నా హీరోకి దెబ్బలు తగలవు. అనుమానం వుంటేరా. ఈ రాత్రి చూద్దువుగాని. కొత్తగా రిలీజయిన సినిమాలో".

కలిపురుషుడు నవ్వి నా భుజంతట్టి. "మరయితే అద్భుత శక్తులున్న వ్యక్తులు ఈ యుగంలో కూడా వున్నారని ఒప్పుకుంటావా? అంటూ మాయమయేడు. నా కల చెదిరి పోయింది, ఆ సాయం




ఒక ఉదయం మనకోసం
ఉదయించే తీరుతుంది!
అలముకున్న చీకటులను
పరిహరించి సాగుతుంది!!
విశ్వాసం కోల్పోయిన
అన్నలార లేచిరండి!
దగాపడిన తమ్ములారా
నడుంగట్టి కదలండి!!
విజయం కోరే ప్రియులకు
సాహసాలు తప్పవోయ్!
సమ సమాజ నిర్మాణం
వీరులకే సాధ్యమోయ్!!
కొన్ని నీటి చుక్కలేను
కరళ్ళొత్తు సముద్రం!
కొన్ని రాళ్ళ సమూహమే
హిమాలయా పర్వతం!!
ఐక్యంగా అడుగేస్తే
ఆకసమే వంగునోయ్
ఎంతటి ఆ కోటైనా
నేల కూలి పోవునోయ్!

—యమ్. అహ్మద్ బాష

త్రం ఓ దగ్గర మిత్రుడికి నా కల గురించి చెప్పాను. నా సందేహ నివృత్తి కోసం ఇద్దరం ఆ రోజు సినిమాకి వెళ్ళాం. సినిమా ఆరంభం అయింది. హీరో హీరోయిన్ల ప్రేమతో ఆరంభమై పాకంలో పడ్డాక ప్రపంచంలోని దుష్ట శక్తులకు చిహ్నంగా విలన్ ప్రవేశించాడు. కథ యొక్క మలుపుః ట్విస్టుల వల్ల హీరోకి విలన్‌కి మూడోరీలు తర్వాత ముష్టియుద్ధాలతో ప్రారంభమై యింటర్వెల్ వచ్చే సరికి బాకు యుద్ధాలుగా మారి ఇంటర్వెల్ తర్వాత పిస్టల్ యుద్ధాలుగాను, ఆఖరి కొచ్చే సరికి రైఫిల్ యుద్ధంగాను మారడం జరిగింది. విలన్‌గాడూ వాడి పది మంది అనుచరులూ మేకమాంసాన్ని కసాయి వాడు కత్తితో కొట్టినట్టు హీరోను చేతులతోను. కర్రలతోను బాద బాదినా ఎక్కడా చెక్కు చెదరక టెన్నిస్ బంతిలా గెంతుతూ సర్కస్ ఆర్టిస్టులా వెనకనుంచి ముందుకీ కింద నుంచి మీదకీ ఎగురుతూనే కాళ్ళతోను, చేతులతోను కొడుతూ తలుపులు అడ్డొస్తే పదడుగుల దూరంనుంచి ఫాస్ట్ బౌలర్‌లా పరిగెట్టుకొచ్చి స్విమ్మింగ్ పూల్‌లో డైవ్ చేసి నట్టు వారి మధ్యకి డైవ్ చేస్తూ విజృంభించాడు. అతడికెక్కడా గీరుకోనన్నాలేదు. ఒక్కొక్క దెబ్బకి విలనూ. వాడి అనుచరులూ ఆమడ దూరాన వెళ్ళి పడ్డారు. ఇక ఆఖర్న జరిగే పిస్టలు_రైఫిలు యుద్ధాల్లో విలన్ యొక్క పదిమంది బృందం రైఫిళ్ళు పట్టుకుని ఎన్ని గుళ్ళు గురిపెట్టి పేల్చినా అవన్నీ ఏ గోడకో, కొండకో, రాయికో తగిలి కాస్త ధూళిని శబ్దాన్ని రేపాయే తప్ప హీరోకిమాత్రం ఎక్కడా తగలలేదు. కాని హీరో కారులోంచి గురిచూసి పేల్చిన పిస్టలు గుండు రాయి - వెనక దాగుండి గాలిలోకి పేల్చిన రైఫిలు గుళ్ళు విలన్ మనుషులకి తగిలి కుయ్యో మొర్రో అంటూ వాళ్ళ పరిగెట్టేటట్టు చేశాయి. ఈ యుద్ధం ఇలా జరుగుతూ వుండగా కథ సుఖాంతం అయింది, ఆ రాత్రి మళ్ళా కలి పురుషుడు కలలోకి వచ్చాడు.

"ఆఖరికి విలన్ని చంపలేకపోయాడే హీరో?" అనడిగాను.

# చిత్రాంబాంజి!


పేరులోన పెన్నిధిగలదంటారు కవులూ-కళా కారులూ. 'ఏ పేరైతేనేంలే, పిలిస్తే పలికేలా వుంటే చాలున'ని ఎల్లయ్య-పుల్లయ్య వంటి పేర్లు పెట్టుకునే పామరజనం కొందరైతే, పేరుకోసం పాకులాడి నిఘంటువులవెంట దేవురించే వాళ్ళూ లేకపోలేదు.

నాకు తెలిసిన ఒహాయన ఓ.ఎన్.జి.సి. (ఆయిల్ ఆండ్ నాచురల్ గాస్ కమిషన్-చమురు సహజ వాయువులు సంస్థ) లో పనిచేస్తున్నాడు. ఆతడికి తెలుగు భాషమీద అపారమైన అభిమానం. అమరం-ఆంధ్రం కంఠోపాఠం చేసింది చాలక, ఇప్పటికీ కనిపించిన ప్రతి 'తెలుగు కాగితాన్నీ తినేయందే వదలడు. చివరికి ఆయన భాషా దురభిమానమూ- దురదా ఎంతవరకు పోయాయంటే, కుర్రాడికి పేరు పెట్టడంలో కూడా, తెలుగులో వినీ-వినీ విసిగిపోయిన పేర్లు కాకుండా 'నిఘంటువుల్లో తప్ప దొరకని పేర్లు పెట్టుకోవాలనుకునే వరకూ.... నామకరణ మహోత్సవం నాడు 'సమీర్' అనే పేరు ఖాయం చేసి-రాస్తే పెళ్ళాం అలిగింది కూడానూ. ఇటువంకా, అటువంకా పెద్దల పేర్లు పెట్టకుండా ఈ పేరేమిటని సంవత్సరన్నర పాటు సణిగింది. (సమీరుడంటే వాయుదేవుడు). అది అలా వుండగా వాళ్ళ చుట్టాల్లో ఓ వ్యక్తికి కొడుకు పుడితే, ఈ 'తెలుగు వెలుగు' గార్ని-ఈయన్ని పేరు సూచించమని అడిగారు. ఈయన "తపన్" అని పెడితే వెరైటీగా వుంటుందన్నాడు. సరేఅని ఖాయం చేస్సేరు. తీరా చూస్తే అదీ వాయుదేవుడి పేరే. నాచురల్‌గా ఆయన 'గాస్' సంస్థలో పన్జేస్తున్నాడు కదా. 'సహజంగా వాయుదేవుడి మీద అభిమానం వుంటుంది మరి.

ఇరువైపుల పెద్దల పేర్లూ కలిపి, వాటికి

## నామకరణ మహోత్సవం

ముందు "వీర వెంకట సత్య" ఇత్యాది విశేషణాలు జోడించి, కొండవీటి చాంతాడంత పేరు పెట్టుకొనే కొందర్ని గురించి-అందరికీ సుపరిచితమే. ఇంగ్లీషులో అయితే వి.వి.యస్.ఎన్.ఎం.టీ.... అంటూ పొడి అక్షరాల్తో సరిపుచ్చుకోవచ్చు. తెలుగులో ఈ తిప్పలు పడలేక మన వాళ్ళు ముద్దు




పేర్లు పెట్టుకుంటారు. పోనీ! అవైనా తిన్నగా వుంటాయా అంటే.... అదీ లేదు. శ్రీనివాస్ సీనుగా అని రూపాంతరం చెందుతాడు. అదాటుగా వింటే 'పీసుగా' అని విన్పిస్తుంది. దానికెవరు బాధ్యులు? వెంకట్రావు 'వెంకు' అయి కూర్చుంటాడు. 'పెంకు' అని విన్పించడంలోనూ తప్పులేదు. సత్యనారాయణ, సత్యమూర్తి, సత్యారావు వంటివాళ్ళు 'సత్తిగాళ్ళు'గా చెలామణీ అవుతుంటే. కత్తితో కోస్తున్నట్లే వుంటుంది. పేరేదైనా గానీ, బుజ్జి-చిన్ని-నాని వంటి పేర్లున్నవాళ్ళు తెలుగునాట మూడింట రెండు వంతులు ఇళ్ళలో వెలుస్తుంటారు. నెత్తిమీదికి అరవయ్యేళ్ళొచ్చినా, ఇంకా బుజ్జిగారే పాపం!

ఇక ఈ-బాధర బందీలేవీ లేకుండా, చక్కని పేరు వుండీ, ఏ గొప్పపనో చేసి పేపరుకెక్కితే, వారి పూర్వజన్మ సుకృతాన అది బహుళార్థ సా(బా)ధక నామధేయంగా మార్చ గల సత్తా తెలుగు ప్రెస్సుల వారిది.

ఆ మధ్య ఓ పెద్ద మనిషి బందరులో ఓ సాహిత్య గోష్ఠిలో ప్రసంగించి, మర్నాడు సదరు వార్త కోసం (నిజానికి అందులో పడిన తన పేరు కోసం) దిన పత్రిక తిరగేసి చూస్తే, తన పేరు గందరగోళానికి గురై తారుమారైన వైనం తిలకించి మూర్ఛపోయాట్ట.... ఇంతకూ అతడి పేరు- "శవతానుధాల చంద్రశిఖర తావు" అని ప్రింటవడం (శతావధానుల చంద్రశేఖర్ రావు గారు.... పాపం!) మహా ముద్రా రాక్షసం కాదా మరి?

ఎడ్వర్డ్, జాన్సన్, మేరీ, లూయీ ఇలాంటి పదాలు-పేర్లలో వున్న ఇంగ్లీషు వాళ్ళు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో చెప్పడం కష్టంగాని, సున్నాణ, సత్తినాణ రామారావు ఇత్యాది పేర్లతో తంటాలు పడుతూ 'ఎవరు ఎవరో తెలీని' ఆయోమయంలో కొట్టుకుపోతున్నాం మనం. ఈ అరిగిపోయిన పేర్లు మార్చేసి, కనీసం భావి తరం వారైనా కొత్త పేర్లు పెట్టుకుంటారని నామకరణ మహోత్సవంతోనే నూతనత్వానికి శ్రీకారం చుట్టగలరని ఆశిద్దాం! (S)

—భాగవతుల సుబ్రహ్మణ్యం

---

"విలన్ని చంపేస్తే మరి పోలీసు వాళ్ళు ఊరుకుంటారా? ఇది కలియుగం కదా?"

"పోలీసులు పట్టుకోలేని విలన్ని పట్టుకుని అప్పగించాడా లేదా?"

"మరి హీరోకి తుపాకీ లైసెన్సు ఎవడిచ్చాడు? ఇష్టంవచ్చినట్లు కాల్చవచ్చని ఎవడు చెప్పాడు? హీరో చంపిన విలన్ బృందంలోని మనుషుల సంగతి ఏమిటి? అది మర్డర్ కింద రాదా?"

"హీరోకి అన్ని శక్తులూ ఉన్నాయి.. చంపాలనుకుంటే చంపగలడు. అదంతా సమాజ కళ్యాణం కోసం చేస్తున్నదే కాని మరేకాదు."

నా మిత్రుడు ఆ సాయంత్రం అన్నాడు ఈ సంగతి చెప్పేసరికి. "ఆహా ఎంత శుభవార్త విన్నాను- ఇటువంటి ఒక్క హీరోని మన సమాజానికి ప్రసాదించు గురూ. పోనీ మీ డైరెక్టర్ని, రచయితని రిక్వెస్టు చేద్దాం పద. అరవై కోట్ల భారతీయుల్లోంచి నీ హీరో లాంటివాడిని ఒక్కడిని ఎంచి మన దేశానికి ప్రసాదించమను. అప్పుడు

# జాతి రత్నాలు

❊ వయస్సు పెరిగే కొద్దీ మనిషిని ఒంటరితనం క్రమ్ముకుంటుంది.

—జాన్సన్

❊ ఎన్నో కష్టనష్టాలు అనుభవించాక గానీ మనిషికి వినయం వివేకం రావు.

—ఫ్రాంక్లిన్

❊ స్త్రీ హృదయం నవనీతం! గట్టిపడిందా దాని ముందు వజ్రం ఎందుకూ పనికిరాదు.

—చలం

❊ మనం ముసలోళ్ళం అవడంతో విషాదంలేదు ఇంకా యువకులుగా ఉండటానికి పడే తాపత్రయంలోనే వుంది విషాదం

—ఆస్కార్ వైల్డ్

లోకంలో అన్నీ తెలిక అనుకున్నవాడు చాలా కష్టాలు ఎదుర్కొంటాడు.

—తేవోష్జే

ఏది మంచో తెలుసుకొని దాన్ని చేయకపోవడం అధమాధమం

—కన్ఫ్యూషియస్

సేకరణ: శ్రీకాంత్



## పుల్లమామిడికాయ

నాని:— బామ్మా నీళ్ళు పోసుకున్నానుగా నాకు పుల్లమామిడికాయ ఇవ్వు అని అడిగాడు నానిగాడు.

బామ్మ:— నీళ్లు పోసుకుంటే పుల్ల మామిడికాయ ఎందుకురా?

నాని:— ఇందాక పక్కింటి మామ్మగారిని మా కోడలు నీళ్ళోసుకుంది పుల్ల మామిడి కాయ ఒకటివ్వండి పిన్నిగారూ! అన్నాదుగా మరి.

ఈ అన్యాయాలు అక్రమాలు అవినీతి ఉఫ్‌మని ఊదిపారేస్తాడా హీరో."

"పోనీ ఈ హీరో వేషం వేసిన నా హీరోని వెళ్ళి బతిమాలుకుందాం. వేషాలు వెయ్యడం మానేసి రంగంలోకి ఉరికి దుష్టశిక్షణ శిష్టరక్షణ చేయమని!"

ఇద్దరం వెళ్ళాం హీరోగారింటికి. అతడి దర్శనం కోసం పడిగాపులు పడి, పదిరోజుల తర్వాత ఓ మూడు నిముషాలు ఇంటర్వ్యూ సంపాదించాను. లోనికి వెళ్ళాం. ఎదురుగా సోఫాలో ఓ నలుగురమ్మాయిలతోనూ నలుగురబ్బాయిలతోనూ జుత్తు బాగా వూడిపోయి ముఖం ముడతలు పడ్డ ఓ అరవైయేళ్ళ వ్యక్తి కూర్చున్నాడు. ఆ అందమయిన యువతీ యువకులు ఆ వ్యక్తితో అతి గౌరవంగా మాట్లాడుతున్నారు.

ఈ యువకుల్లో నా హీరో కోసం వెతికాను. అగపడలేదు. ఆ ముసలాయనతో అంత గౌరవంగా మాట్లాడుతుండడం గమనించి అతడు హీరోగారి తాతగారేమో ఇంకా హీరో లోనుంచి వస్తాడేమో అని అనుకుంటూ వుండగా—

"మీరు హీరో గిరీ మానేస్తారని విన్నాం?" అంటూ ఆ ముసలాయన్ని వేసిన ప్రశ్న విని అదిరిపడ్డాము.

ఆ ముసలి మనిషి నవ్వాడు.

"మానేయమంటారా? మీరంతా మానేయమంటే వెంటనే మానేస్తాను".

"అబ్బే. మీరు హీరో వేషాలు వెయ్యడం మానేస్తే మేమంతా ఏం కావాలి? మీ సాహస కృత్యాలే మా జీవితాల కండ. ఎప్పుడో ఒకప్పుడు మీ వంటివాడు భూమిమీద అవతరించి ఈ అవినీతిని నిర్మూలించి రామరాజ్యం ఏర్పరుస్తాడన్న ఆశ మీరు హీరోగిరీ మానెయ్యగానే మాకు నశిస్తుంది. తర్వాత మాకు మిగిలేది నిరాశే."

అతడు వృద్ధ జంబూకంలానవ్వేడు. నా మిత్రుడిని గమనించాను. హతాశుడయినట్లు కూలబడిపోయేడు. వెండి తెరమీద చిన్ననాటినుంచి నిత్య యవ్వనుడుగా చూసిన హీరో ఇతడేనా? అన్న అనుమానం అతడికీ వచ్చింది—నాకూ వచ్చింది.

"అంతా మీ అభిమానం. మీరు వెయ్యమన్నంతవరకూ హీరో వేషాలు వెయ్యక తప్పదు కదా నాకు. ఏడాదికి నాలుగు పిక్చర్లకన్నా వెయ్యనంటే ప్రొడ్యూసరు ఒప్పుకోడు. పాతిక పిక్చర్లకి కాల్‌షీట్లు ఇవ్వక తప్పలేదు ఈ ఏడు. ఏం చేయను—" బుర్ర తడుముకున్నాడు.

ఇంతలో కాఫీలువచ్చాయి ఆయన మాత్రం సెక్రటరీ అందించిన రెండు బిళ్ళలు మింగి గుక్కెడు మంచినీళ్ళు తాగాడు.

> ## నా దృక్పథం
>
> రకరకాల వాదాలు లేబుల్స్‌వంటివి. లేబులు మారినంత మాత్రాన కవిత్వ స్వరూపం మారదు. కవిత్వంలో వుండటమే కవిత్వలక్షణం. ఏ వ్యవస్థలోనైనా దానికి సాంఘిక ప్రయోజనం వుంటుంది. అది ఉన్నంతకాలం దాన్ని ఏ పేరుతో పిలిచినా ఫర్వాలేదు.
>
> —ఆరుద్ర

"తలనొప్పిగా వుందా సార్? మాత్రలు వేసుకుంటున్నారు?" అని నేను అడగ్గా హీరో నా వేపదోలా చూశాడు. తర్వాత చిరునవ్వు నవ్వేడు.

"ఇవి రెండే కాదు మాత్రలు. ఈ రెండూ నా బ్లడ్ క్లోరెస్టర్ అదుపులో పెట్టుకుందుకు వాడిన మాత్రలు. ఇవి కాక బ్లడ్ షుగర్ అదుపులో పెట్టుకుందుకు మాత్రలు డైబటీసుకు ఇంజక్షన్‌లు. బ్లడ్ ప్రెషర్‌కి మాత్రలు గంటలవారీ వాడాల్సిందే."

షాకు తిన్నాం మేం. వెంటనే తేరుకోలేకపోయాం. "మరి సినిమాలో తమరు అంతలా దెబ్బలాడి తుపాకులు పేల్చి హీరోయిన్‌లతో గెంతి...."

పకపకా నవ్వాడు హీరో. నవ్వగానే అతడి కట్టుడు పళ్ళు వశం తప్పి పుదేల్మని టేబులుమీద పడ్డాయి. అంతరిక్షంనుంచి అణుబాంబు పడ్డట్టు అందరూ చకితులయ్యేరు. కానీ నా హీరో మాత్రం చెక్కు-చెదరలేదు. పళ్ళు తీసి మళ్ళా తగిలించుకుని సెక్రటరీతో అన్నాడు—

"వీటి ఎలైన్‌మెంట్ సరిగావున్నట్టు

(31వ పేజీ తరువాయి)

లేదయ్యా. ఆ డెంటిస్ట్‌కి కబురుచేసి కాస్త చెక్ చేయమను."

మావేపుకు తిరిగి అన్నాడు.

"నీకు తెలుసునో, తెలియదో కాని అసలు పళ్ళుకన్నా కట్టుడు పళ్ళే నయం. అందుకే అసలు పళ్ళు పీకించి ఇవి పెట్టుకున్నాను. ఇవి నిజంగా హీరో పళ్ళలా వుంటాయి. ఇంక ఫైటింగు అంటారా? అంతా డ్యూప్ చూసుకుంటాడు. హీరోయిన్లతో గెంతడానికి. వాళ్ళ ఒళ్ళు రుద్దడానికి కూడా ఓపిక పోతూంది. కాని అక్కడ తప్పదు.

"హీరోయిన్‌లతో డాన్సులకి మాత్రం డ్యూప్‌ని పెట్టకండిసార్." ఓ యువతి కళ్ళలో ఆరాధనతో అభ్యర్థించింది.

"ఆ పరిస్థితి రానివ్వనులెండి." అన్నాడు హీరో చిలిపిగా ఆ సుందరి కళ్ళల్లోకి చూసి.

మూడు నిముషాలయిపోగానే బయట పడ్డాం. నా మూడంతా పాడయిపోయింది. ఇన్ని అపూర్వ శక్తులని వరాలుగా ఇవ్వగలిగే దర్శక నిర్మాత కథకులని, అన్ని అపూర్వ శక్తులున్నాయని సినిమా చూస్తూన్నంతసేపూ నమ్మే ప్రేక్షకుల్నీ ఇప్పుడు తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది.

ఒకరోజు స్థానిక గ్రంథాలయానికి బయలుదేరాను. హీరో లేని కథల పుస్తకం కాని నవలకాని ఉంటే తెచ్చుకుందామని.

"హీరోలేని కథల సంపుటి గాని నవల గాని ఉంటే ఇవ్వండి." అని అడిగాను లైబ్రేరియన్ని.

అరవైయేళ్ళ దగ్గర పడ్డ పంతులు నాకేసి చూసి పిచ్చివాడిని చూసినట్టు చూశాడు. "మీకేం మతి చలించలేదు కదా." అనడిగాడు.

"ఆదేమిటండీ అలాగంటారు?" అని ఆడిగాడు.

"మీరు అడిగిన పుస్తకం ఏ యుగంలోనూ ఏ దేశంలోనూ ఏ రచయితచేతా రాయబడలేదు. రాయబడబోదు."

"అలా అయితే ఒక్క హీరోని.... మచ్చుకొక్క హీరోని నాకు చూపండి. రక్తమాంసాలతో బతికున్న వాడిని. ఆ నవలల్లోను, కథల్లోనూ వున్నట్టు హీరోని."

అంటూ సవాలు చేశాను.

అందుకతడు విపరీతంగా నవ్వేడు. కళ్ళజోడు సవరించుకుని ముందుకి వంగి ఏదో మహా రహస్యం చెబుతున్నట్టు అన్నాడు.

"ఎక్కడో వెతుకుతావేం? ఆ హీరోవి నువ్వే." అంటూ నా భుజం తట్టేడు, ఏ సందేహమూ అవసరం లేదన్నట్టు కన్నుగీటి.



## నీళ్లో బస్సు

త్వరలోనే బొంబాయి నగర వాసులు ఇంటికీ, ఆఫీసుకూ సముద్రం మీదుగానే వెళ్ళిరావటం చేస్తారు. రోడ్లమీద రద్దీని తగ్గించడానికి గాను మహారాష్ట్ర ప్రభుత్వం నీళ్ళమీద నడిచే కొత్తరకం బస్సులను ప్రవేశ పెట్టేందుకు యోచిస్తోంది.

రోడ్లమీద కారు ప్రయాణం కంటే సముద్రం మీద ఈ బస్సు ప్రయాణమే చవకగా త్వరగా కాలుష్యం లేకుండా ఉంటుందని నిపుణులు అంటున్నారు. ఇదిలా ఉండగా ఈ సముద్రపు బస్సులను ప్రభుత్వమే నడపాలా లేక ప్రైవేటు ఆపరేటర్లకు అప్పగించాలా అనేది ఇప్పుడు పెద్ద సమస్యగా తయారయింది.

—మైనేని ఏకవీర

# ఈ పుస్తకం చదివారా?

**నడక నా తల్లి:** కవితాసంపుటి. కవి: డా॥ సి. నారాయణరెడ్డి. పుటలు: 82. వెల: 20/–లు ప్రతులకు: మనస్వినీ ప్రచురణలు. 1–10–22/18 వివేకనగర్, హైదరాబాద్ – 500020

"నడక నా తల్లి
పరుగు నా తండ్రి"—నా దృష్టిలో నడక సంస్కృతిలాంటిది. పరుగు నాగరికత లాంటిది. అందుకే వీటిని తల్లి తండ్రీ అన్నాను. వ్యక్తిగా, కవిగా నా జీవనగమనం ఈ రెంటి సమన్వయం" అంటున్నారు సి. నారాయణరెడ్డి.

భావకవుల్లో అద్భుతభావుకుడు సి.నా.రె అభ్యుదయ కవుల్లో ఎన్నదగినవాడు.

"ఎన్నిసార్లు చెక్కితే" అనే గేయంలో—

"ఎన్నిసార్లు చెక్కితే శిల్పం
ఎన్నిసార్లు తీర్చితే చిత్రం
కబుర్లు చెప్పకే కాలమా
ఎన్నిసార్లు చస్తే ఓ జీవితం?"

అంటూ రసానుభూతిని కల్గించి మన హృదయాన్ని గుప్పెట్లోకి తీసుకున్నాడు.

"వరుసమారుతున్నది" అనే గేయంలో—

"ప్రజా సుఖమే తమ సుఖమని
వరదానాలిస్తున్నా
ఎక్కడ వేసిన గొంగడి
అక్కడనేపడివున్నది"—అంటూ శుష్క వాగ్దానాలతో ప్రజల్ని ఏమార్చే ప్రభుతకు "సిగ్గులేదా నీకు?" అన్నట్టు చురకవేశారు.

అంతే కాదు—

కృతజ్ఞతలు అనే ఖండికలో-

"లాభమేమి విష వృక్షం పెరిగి పెరిగి
నాభివేరు పెరికేస్తే కృతజ్ఞతలు
నాటిన సరికొత్తమొక్క ఎదిగి ఎదిగి
నవచేతన ఫలియిస్తే కృతజ్ఞతలు!!

ఇలా తనలో దాగివున్న సర్వశక్తినీ విప్లవానికి కృతజ్ఞతలు చెప్పడంతోనే సరిపెట్టుకున్నాడు.

—యం. కె. సుగమ్‌బాబు